
సాక్షి
వికారాబాద్

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



బుగ్గి కావాల్సిందేనా?

మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పదేళ్ల నుంచి మండల రైతులు కోరుతున్నారు. 8లో▸



యథేచ్ఛగా అడవి నరికివేత!

ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్ నంగయపల్లి బీట్‌లో అక్రమార్కులు అడవిని నరికివేస్తున్నారు. 8లో▸



అనుమతులు కొంత..

నియోజకవర్గంలో మట్టి మాఫియాకి అధికార పార్టీ నాయకులు వత్తాసు పలకడంతో.. అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. 9లో▸

అవిశ్వాస మంటలు

- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్ జెడ్పీటీసీల పట్టు
- అడిషనల్ కలెక్టర్‌ను కలిసి నోటీసులు ఇచ్చిన 12మంది
- తమకు సరిపడా మద్దతు ఉందంటున్న జెడ్పీ చైర్‌పర్సన్
- నెగ్గాలంటే 12 మంది, వీగి పోవాలంటే ఏడుగురి మద్దతు అవసరం
- తేదీ ప్రకటించిన వెంటనే క్యాంపులకు జెడ్పీటీసీలు!



అడిషనల్ కలెక్టర్‌కు శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిపై అవిశ్వాసం నోటీసు ఇస్తున్న జెడ్పీటీసీలు

వికారాబాద్: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ అనుకూల జెడ్పీటీసీలు ఇచ్చిన అవిశ్వాసం నోటీసుల వ్యవహారం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసిన 12 మంది జెడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం తీర్మానం నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇద్దరూ ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లా కావటంతో అవిశ్వాసం వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో నాలిగింటికి నాలుగు అసెంబ్లీ స్థానాలు అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆ పార్టీ నేతలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఓ పక్క మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి ఈ విషయాన్ని చాలెంజ్‌గా తీసుకుని అవిశ్వాసం వ్యవహారం వెనకాల ఉండి నడిపిస్తున్నారు. మరో పక్క క్యాంపు రాజకీయాల్లో తలపండిన పట్నం మహేందర్‌రెడ్డి సైతం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. దీంతో ఈ అంశం జిల్లాలోనే కాకుండా ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యింది.

గెలవాలంటే 12 మంది అవసరం

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న మరుసటి రోజే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బీఆర్‌ఎస్ పార్టీ పావులు కదిపింది. జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో కలిపి మొత్తం 18 మంది జెడ్పీటీసీలు ఉండగా అవిశ్వాసం నోటీసులు ఇవ్వాలంటే సాధారణ మెజార్టీ సభ్యులు ఉంటే సరిపోతుంది. కాగా నోటీసులిచ్చేందుకు 12 జెడ్పీటీసీలు హాజరై అడిషనల్ కలెక్టర్ ముందే సంతకాలు చేసి ఆయనకు అందజేశారు. అవిశ్వాసం నెగ్గాలంటే 2/3 మెజారిటీ అంటే 12 మంది జెడ్పీటీసీలు అవసరమవుతారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన జెడ్పీటీసీలు అందరూ చివరి వరకు అలాగే ఉంటే అవిశ్వాసం నెగ్గేందుకు వీలు ఉంటుంది. ఇదే సమయంలో అవిశ్వాసం వీగిపోవాలంటే జెడ్పీ చైర్‌పర్సన్‌తో కలిపి ఏడుగురు సభ్యులు ఉంటే సరిపోతుంది. అంటే అవిశ్వాసం గెలవాలంటే ఇప్పుడు బీఆర్‌ఎస్‌కు 12 మంది జెడ్పీటీసీల మద్దతు అవసరం ఉండగా వీగిపోవాలంటే అధికార కాంగ్రెస్‌కు ఏడుగురు సభ్యుల మద్దతు కావాలి. అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన జెడ్పీటీసీలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ కలక్టరేట్‌కు రాగా పరిగి, కొండంగల్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి అక్కడికి రాలేదు. అయితే 15 రోజుల్లోగా కలెక్టర్ అవిశ్వాసం ఓటింగ్ డేట్ ఇవ్వటంగాని లేదంటే ప్రభుత్వానికి సమాచారం పంపటంగాని చేయాలి. ఈ నేపథ్యంలో ఆయన నోటీసులు ఇచ్చిన వెంటనే అధికార, విపక్ష పార్టీలు జెడ్పీటీసీలను క్యాంపునకు తరలించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

మద్దతుగా వచ్చింది వీరే..

జిల్లాలో మొత్తం 18 జెడ్పీటీసీలు ఉండగా 2019లో జరిగిన ఎన్నికల్లో పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ మినహా 17 మంది జెడ్పీటీసీలు అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్‌కు చెందిన వారే గెలుపొందారు. దీంతో అప్పట్లో సునీతా మహేందర్‌రెడ్డి మూడోసారి చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకోగా వైస్ చైర్మన్‌గా మోమిన్‌పేట జెడ్పీటీసీ సభ్యుడు బైండ్ల విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాజాగా సునీతారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసులు అందజేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో సునీతారెడ్డితో పాటు పెద్దేముల్, బషీరాబాద్ జెడ్పీటీసీలు ఉండగా వారి బలం మూడుకు చేరింది. ఇక బీఆర్‌ఎస్‌లో 15 మంది జెడ్పీటీసీలు ఉండగా 12 మంది జెడ్పీటీసీలు అవిశ్వాసం నోటీసులు ఇచ్చే ప్రక్రియలో పాల్గొన్నారు. ఓవరాల్‌గా ఆరుగురు జెడ్పీటీసీలు హాజరు కాలేదు. వికారాబాద్, పరిగి, మోమిన్‌పేట, మర్పల్లి, దారూరు, నవాబుపేట, దౌల్తాబాద్, దోమ, కుల్కచర్ల, పూడూరు, కొడంగల్, తాండూరు జెడ్పీటీసీలు అవిశ్వాసం నోటీసులు ఇచ్చినవారిలో ఉన్నారు. మొత్తానికి జిల్లాలో అవిశ్వాసం కాక రేపింది.

“ రాజీనామా చేయాలి



అధిష్టానం సూచన మేరకే అవిశ్వాసం నోటీసులు ఇచ్చాం. మాకు పూర్తి మెజారిటీ ఉంది. అవిశ్వాసం నెగ్గి తీరుతాం. ఉద్యమ సమయంలో టీడీపీలో ఉన్న మహేందర్‌రెడ్డి తెలంగాణ వచ్చే సమయానికి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు కేసీఆర్ రెండుసార్లు మంత్రి పదవి, ఎమ్మెల్యేగా ఓడిపోయిన వెంటనే ఎమ్మెల్సీగా అవకాశం, ఆయన భార్య సునీతారెడ్డికి రెండుసార్లు జెడ్పీ చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టారు. అవన్నీ మర్చిపోయిన వారు కాంగ్రెస్‌లో చేరటం అనైతికచర్యగా భావిస్తున్నాం. ఇప్పటికైనా ఆమె జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తే అవిశ్వాసం నోటీసులు వెనక్కి తీసుకుంటాం.

– బైండ్ల విజయ్‌కుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్

న్యూస్‌రీల్

‘చలో సెక్రటేరియట్’కి తరలిరండి: డీడీఎన్‌ఎస్

కొడంగల్ రూరల్: చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని దూప దీప నైవేద్య అర్చక సంఘం(డీడీఎన్‌ఎస్) జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. 14ఏళ్ల క్రితం నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఆలయాల్లో నిత్య దూప దీప నైవేద్యాలు అందించాలని సామాన్యమైన గౌరవ వేతనంతో పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అర్చకులకు రూ.10వేల గౌరవ వేతనం అందిస్తున్నారని, ఇందులో రూ.4వేలు దూప దీప నైవేద్యాల కొరకు, మిగిలిన రూ.6వేల రూపాయలు అర్చకులకు వేతనంగా అందిస్తున్నారని అన్నారు. అయితే అర్చకులకు వేతనాలు అందించడంలో జాప్యం జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డీడీఎన్‌ఎస్ అర్చకులకు కనీస వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్తగా నియామకమైన అర్చకులతోపాటు పాత అర్చకులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా మంగళశారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందించాలని రాష్ట్ర డీడీఎన్‌ఎస్ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు అదేరోజు నిర్వహించనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి అర్చకులు సంఘటితంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్పీకర్‌ను కలిసిన పట్నం దంపతులు



మొక్క బహూకరిస్తున్న పట్నం దంపతులు

అనంతగిరి: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆదివారం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి పూలమొక్క అందించారు. అనంతరం కాసేపు జిల్లా అభివృద్ధిపై స్పీకర్‌తో చర్చించారు.

షాద్‌నగర్ ఎంవీఐ బాలు నాయక్ బదిలీ

షాద్‌నగర్: షాద్‌నగర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బాలు నాయక్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మూడు సంవత్సరాల పాటు ఇక్కడ సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఆయనను నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేశారు. బాలు నాయక్ స్థానంలో కొత్తగా ఇక్కడికి హైదరాబాద్‌లో పని చేస్తున్న వాసు రానున్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



హుడాకాంప్లెక్స్: వీధి కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా తిరుమలగిరికి చెందిన కొమ్ము మధు బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసివచ్చి సరూర్ నగర్ డివిజన్ పరిధి జింకల బావి కాలనీలో నివసిస్తున్నారు. బట్టల దుకాణంలో గుమస్తాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని కుమారుడు వినీత్ (7) సరూర్ నగర్‌లోని లయోలా స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స కోసం లక్ష రూపాయలు కర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేశారు

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్‌రెడ్డి

అనంతగిరి: గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, వాయిస్ ఆఫ్ తెలంగాణ పత్రిక ప్రధాన సంపాదకులు మాణిక్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆదివారం వికారాబాద్ పట్టణంలోని నాగార్జున స్కూల్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా పాలనలో కొత్త ఒరవడిని తెస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల నుంచి ఐటీ మినహాయింపులు పెంచకపోవడం చాలా బాధాకరమని, దీనివల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. గతంలో ఆగిపోయిన సాధారణ బదిలీలు, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ ఏరియర్స్ చెల్లింపులు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పీఆర్‌సీ కమిషన్ కూడా త్వరగా నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘సీఓఈ సెట్’

షాద్‌నగర్‌రూరల్: గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) సెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థుల హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, బోనఫైడ్, పరీక్ష ప్యాడ్ తనిఖీచేసి కేంద్రంలోకి అనుమతించారు. సాంఘీక సంక్షేమ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 312 మంది విద్యార్థులకుగాను 280 మంది హాజరు కాగా 32మంది గైర్హాజరయ్యారు. సీఓఈ సెట్ పరీక్ష కేంద్రం పరిశీలకురాలు ఓఎస్‌డీ అశ్విని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా సురేందర్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రంవద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మొగులయ్యకు నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

పీఏసీఎస్ చైర్మన్‌గా మొగులయ్య

- ఒకే ఒక్క నామినేషన్ పత్రం దాఖలు
- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన అధికారులు

కుల్కచర్ల: కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా కొనసాగిన మనోహర్ రెడ్డి సాధారణ ఎన్నికల్లో తాండురు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. తదనంతరం కుల్కచర్ల సహకార సంఘానికి రాజీనామా చేయడంతో చైర్మన్ పోస్ట్ ఖాళీ ఏర్పడింది. కొద్దిరోజులు వైస్ చైర్మన్‌కు.. చైర్మన్‌గా బాధ్యతలను అందించారు. ఈ క్రమంలో గత శుక్రవారం జిల్లా సహకార సంఘం అధికారులు చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయగా ఆదివారం 13 మంది డైరక్టర్లకు గాను చైర్మన్ అభ్యర్థిగా కేవలం ఒకే ఒకరు నామినేషన్ వేయడంతో నామినేషన్ వేసిన కనకం మొగులయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. దీంతో అయనకు నియామకపత్రాన్ని అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికై ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని, ఇచ్చినమాట ప్రకారం తప్పనిసరిగా రుణమాఫీ చేస్తామని మెగులయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు కుమ్మరి స్వామి, బచ్చిరెడ్డి, కృష్ణయ్య, బాల్ రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటయ్యాయి అవును మీరు వింటున్నది నిజమే. రాష్ట్రంలో ఉప్పు నిప్పులా పోట్లాడుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కుల్కచర్ల మండలంలో ఒక్కటయ్యాయి. ఆదివారం జరిగిన కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మొగులయ్యకు బీఆర్‌ఎస్ పార్టీ డైరెక్టర్లు కూడా మద్దతు తెలిపారు. సంఘం డైరెక్టర్లందరూ ఏకాభిప్రాయంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మొగులయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత తాండురు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గతంలో తన రాజకీయ చతురతతో ఎన్నికలు జరగకుండానే చైర్మన్‌గా తాను గెలుపొందడంతో పాటుగా డైరక్టర్లందరినీ గెలిపించుకున్నారు. ప్రస్తుతం ఆయన సహకార సంఘానికి రాజీనామా చేసినప్పటికీ తమ అనుచరవర్గం నేతలకు పదవులు దక్కేలా చతురతను ప్రదర్శించారు.

అందరి గురి.. చేవెళ్ల బరి

హాట్ సీట్‌గా లోక్‌సభ స్థానం

- బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీకే అవకాశం
- బీజేపీ నుంచి కొండా పేరు దాదాపు ఖరారు
- కాంగ్రెస్ నుంచి కేఎల్‌ఆర్, సునీతారెడ్డి మధ్య పోటీ
- ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టిన ఆశావహులు
- ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే చాన్స్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ స్థానాలకు ఏ క్షణమైనా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉండటంతో ఇటు జిల్లా యంత్రాంగంతో పాటు అటు రాజకీయ పార్టీలు కూడా సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని కీలకమైన చేవెళ్ల స్థానంపై అధికార కాంగ్రెస్ సహా ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ దృష్టి సారించాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డినే మళ్లీ బరిలోకి దించనున్నట్లు ఇప్పటికే బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించింది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఆయన పేరే దాదాపు ఖరారు చేసే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ నుంచి రోజుకో కొత్త అభ్యర్థి తెరపైకి వస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయనున్నారనే ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయనకు మధ్య కొంత అభిప్రాయ బేధాలు తలెత్తడంతో ఆయనకు ఈ స్థానం దక్కకపోవచ్చనే చర్చ నడుస్తోంది. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి రెండు రోజుల క్రితం కారు దిగి హస్తం పార్టీలో చేరడంతో ఆమెకే అవకాశం ఉంటుందన్న ప్రచారం ఊపందుకుంది. మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉద్దండులు బరిలోకి దిగనుండడంతో ఈసారి చేవెళ్ల పోరు రసవత్తరంగా మారనుంది.

క్షేత్రస్థాయిలో ఆశావహులు

చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలో మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. షాద్‌నగర్, కొడంగల్ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్ పరిధిలో ఉండగా, కల్వకుర్తి నియోజకవర్గం నాగర్‌కర్నూల్ పరిధిలో కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం భువనగిరి పరిధిలో, ఎల్బీనగర్ నియోజకవర్గం మేడ్చల్ మల్కాజిగిరి పరిధిలో కొనసాగుతున్నాయి. 2019లో ఎన్నికల్లో 23 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 12,70,687 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్ రెడ్డికి 5,16,363 ఓట్లు (40.64 శాతం) రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 5,0,318 ఓట్లు (39. 61శాతం)వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బి.జనార్దన్‌రెడ్డికి 1,95,919 ఓట్లు (15.42 శాతం) వచ్చాయి. బీఎస్పీ సహా ఇతర పార్టీలకు డిపాజిట్ దక్కలేదు. పోటీలో ఉన్న 20 మందికి నోటా (9,045) కంటే తక్కువ ఓట్లు పోలవడం గమనార్హం. 2024 ఫిబ్రవరి 8 నాటికి ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 29,14,124 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. వీరిలో 14,93,369 మంది పురుషులు, 14,20,469 మంది మహిళలు ఉన్నారు. మరో 286 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు పోటాపోటీగా తలపడనున్నారు. ఆయా పార్టీల నుంచి టికెట్లు ఆశించే నేతలంతా ఆర్థికంగా బలవంతులు కావడంతో ఎన్నికల కోసం భారీగా ఖర్చుపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే వీరంతా క్షేత్ర స్థాయిలో పర్యటించడంతోపాటు ఇతర పార్టీల్లో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు వల వేస్తున్నారు. వీరికి భవిష్యత్తులో పలు రాజకీయ పదవులతో పాటు నగదు, ఖరీదైన వాహనాలు ఎరగా చూపుతున్నట్లు తెలిసింది.

తుది ఓటరు జాబితా వెల్లడి

లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు జాతీయ ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటించింది. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఈ నెల 8న జాబితా విడుదల చేసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,369 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటి పరిధిలో 35,91,987 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 18,50,292 మంది పురుషులు, 17,40,379 మంది మహిళలు ఉన్నారు. 449 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. వీరితో పాటు 286 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, మరో 581 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. వికారాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9,84,068 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది మహిళలు ఉన్నారు. మరో 39 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు.

నియోజకవర్గ పరిధిలో ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
మహేశ్వరం	511	5,56,110	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	5,99,778	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	7,47,757	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	2,69,166	1,35,261	1,33,820	06
పరిగి	269	2,66,273	133625	132639	09
వికారాబాద్	284	2,31,679	115019	116647	13
తాండూరు	269	2,42,3849	118228	125614	07

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని మెడికల్ షాప్ నిర్వాహకులతో షాహీన్‌నగర్‌లోని ఉమర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం డ్రగ్స్‌పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొందరు విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలకు బానిసై నేరస్తులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, వైట్నర్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలతో సమాజానికి హాని కలిగిస్తున్నారన్నారు. బయట మార్కెట్లలో లభ్యమయ్యే మత్తు పదార్థాలపై పోలీస్ నిఘా పెంచి కట్టడి చేస్తుండడంతో మెడికల్ దుకాణాల్లో లభించే డ్రగ్స్ తీసుకొని మత్తులోకి జారుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో మెడికల్ షాప్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దని, అలా విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ ఉమా మహేశ్వర్ రావు, బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు వెంకట్ రెడ్డి, గురువా రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

క్లుప్తంగా

రమేష్ మహరాజ్‌కు అభినందనల వెల్లువ



రమేష్ మహరాజ్‌ను సన్మానిస్తున్న స్మితాసబర్వాల్

తాండూరు టౌన్ : స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియామకమైన పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో కమిషనర్ స్మితాసబర్వాల్ రమేష్ మహరాజ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు చెప్పారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ధారాసింగ్, నాయకులు ఉత్తంచంద్, జనార్దన్‌రెడ్డి, రోహిత్ మహరాజ్, నాగప్ప, గోపాల్, నర్సింహులు, లక్ష్మణ్ తదితరులు రమేష్ మహరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ధ్యానంతో ఆరోగ్యం పదిలం

పిరమిడ్ స్పిర్చువల్ సంస్థ . ధ్యాన ప్రచారకర్త శైలజ



అవగాహన కల్పిస్తున్న శైలజ

దోమ: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానాన్ని అలవర్చుకోవాలని పిరమిడ్ స్పిర్చువల్ సంస్థ ధ్యాన ప్రచారకర్త గుండం శైలజ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శివారెడ్డిపల్లి, బొంపల్లి, బాస్‌పల్లి, గొడుగోనిపల్లి, దోర్నాల్‌పల్లి గ్రామాల్లో ధ్యానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధ్యానం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు అలవాటు చేసుకుంటే గుండె జబ్బులు, బీపీ, షుగర్, కిడ్నీ, సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిర్చువల్ సంస్థ ధ్యానకర్త ప్రధాన కార్యదర్శి ఆంజనేయరెడ్డి, పిరమిడ్ సంస్థ సభ్యులు నవీన్, గుండం శోభిత, బాలక్రిష్ణారెడ్డి, శ్రీనివాస్, బాబు, వేణు, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆమనగల్లు: పట్టణంలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ బాల్‌రాం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మేడిగడ్డతండాకు చెందిన కృష్ణ(41) ఈ నెల 16న ద్విచక్ర వాహనంపై ఆమనగల్లుకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దీనిపై మృతుని భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కడ్తాల్: షాద్‌నగర్–కడ్తాల్ ప్రధాన రహదారిపై బైక్, ఆటో ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని టాక్‌రాజ్‌గూడ తండా సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన యాట వెంకటేశ్ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై కడ్తాల్‌కు వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో టాక్‌రాజ్‌గూడ సమీపంలో ఎదురుగా వస్తున్నా ఆటో అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

బుగ్గి కావాల్సిందేనా?

- అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం అన్నదాతల ఎదురుచూపులు
- చేతి కొచ్చిన పంటలు అగ్నికి ఆహుతి
- లబోదిబోమంటున్న రైతన్నలు



బండమీదిపల్లిలో కాలిపోతున్న చెరుకు తోట (ఫైల్)

పెద్దేముల్ : మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పదేళ్ల నుంచి మండల రైతులు కోరుతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసం వచ్చిందంటే కంది, చెరుకు రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా వందల ఎకరాల్లో పంటలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. చెరుకు పంటలు షార్ట్ సర్క్యూట్‌కు గురై కాలిపోతున్న తమ గోడు ఎవరు పట్టించుకోవడం లేదని రైతన్నలు వాపోతున్నారు. దీంతో రైతులు లక్షల్లో నష్టపోతున్నారు. ఐదు ఏళ్ల క్రితం హన్మాపూర్‌లో కౌలు రైతు అనంతయ్య 17ఎకరాల పొలం కౌలుకు తీసుకొని కంది పంటను సాగుచేశాడు. పంట చేతికి వచ్చే సమయంలో గుర్తు తెలియని దుండగులు నిప్పంటించటంతో మూడు లక్షల వరకు నష్టం వాటిల్లింది. అలాగే, మూడేళ్ల క్రితం పెద్దేముల్ కౌలు రైతు రాములు చెరుకు పంట షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు లక్ష వరకు నష్టపోయాడు. బండమీదిపల్లి, తట్టెపల్లి, అడ్కిచెర్లతో పాటు పలు గ్రామాల్లో తరుచు చెరుకు పంటలు కాలిపోతున్న ప్రభుత్వం చిల్లిగవ్వ నష్టపరిహారం చెల్లించడం లేదని రైతున్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో రైతులు వంద శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కంది, వరి, చెరుకు, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలతో పాటు పలు రకాల కూరగాయల పంటలు సాగు చేస్తారు. పంటలకు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుంటే 26కిలో మీటర్ల దూరం నుంచి అగ్నిమాపక శకటం రావాల్సిన పరిస్థితి ఉంది. అంతలోపు పంటలు పూర్తిగా బుగ్గి అవుతున్నాయని తట్టెపల్లి, అడ్కిచెర్ల, పాషాపూర్, మన్‌సాన్‌పల్లి, జైరాంతండాతో పాటు పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. అందుకు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మండల రైతులు సుమారు పదేళ్ల నుంచి పాలకులకు, అధికారులను కోరుతున్నారు. కాని, ఎవరూ పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం జనగాం, పెద్దేముల్‌తో పాటు పలు గ్రామాల్లో సుమారు 40 ఎకరాల వరకు చెరకు, కంది పంటలు కాలిపోయాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు.

గత ఏడాది బండమిదిపల్లి, తట్టెపల్లి గ్రామాల్లో షార్ట్ సర్క్యూట్‌కు సుమారు 25 ఎకరాల వరకు చెరుకు పంటలు కాలి బుడిదయ్యాయి. కావునా, అగ్నిమాపక కేంద్రం అందుబాటులో ఉంటే పంటలను కాపాడుకోవచ్చని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు. పెద్దేముల్ మండలంలో అధిక గ్రామాలు కర్ణాటకకు సరిహద్దుల్లో ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరిగినా సమయానికి అగ్నిమాపక శకటం రావడం లేదని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ఏటా పెట్టుబడులు పెరగటంతో అప్పుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తట్టెపల్లిలో కాలిపోయిన చెరుకు (ఫైల్)

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి. అగ్నికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేక కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో బుగ్గి పాలవుతున్నాయి.

– చంద్రప్ప, రైతు, కొండాపూర్

ఏటా నష్టపోతున్నాం



ప్రతి ఏటా పంటలు కాలి పోతున్నాయి. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసంలో సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది తట్టెపల్లి, బండమిదిపల్లి గ్రామాల్లో చెరుకు తోటలు పట్టపగలే షార్ట్ సర్క్యూట్‌తో కాలి బుడిదయ్యాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– వెంకటరెడ్డి, రైతు, అడ్కిచెర్ల

రైతులను ఆదుకోవాలి



షార్ట్ సర్క్యూట్‌తో పంటలు కాలిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి ఏటా పెట్టుబడులు పెట్టలేక అప్పుల పాలవుతున్నారు. పంట దిగుబడి తగ్గిపోతుంది. రెండేళ్ల నుంచి భారీ వర్షాలకు పంటలు కూడా సక్రమంగా పండటం లేదు. పెట్టిన పెట్టుబడులు రాక అప్పులతో బాధపడుతున్నాం.

– ఏనప్ప, రైతు, తట్టెపల్లి

మొదటి విడత 4 వేల ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: త్వరలో నియోజకవర్గానికి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపూర్‌లో ఎమ్మెల్యేకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల హామీలు అమలు చేస్తామని పేర్కొన్నారు. మన జిల్లావాసి రేవంత్‌రెడ్డి సీఎం కావడం వికారాబాద్ అభివృద్ధికి తిరుగుండదని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ఉచిత కరెంట్‌తో పాటు మహిళలకు నెలకు రూ.2500 కూడా అందజేస్తామని చెప్పారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డే శ్రీను, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు ఉప్పరి రాజు, నాయకులు నర్సిములు ,శ్రీశైలం, బాల్‌రెడ్డి, వెంకటప్ప, నాగరాజులు ఉన్నారు.

ప్రారంభానికి నోచుకోని మీటింగ్ హాల్



అసంపూర్తి ఉన్న మీటింగ్ హాల్

బంట్వారం: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మీటింగ్ హాల్ ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. బంట్వారం మండల కేంద్రంలో దాదాపు 14 ఏళ్ల కిందట మీటింగ్ హాల్ నిర్మాణం పనులు చేపట్టారు. అప్పట్లో రంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్‌గా ఉన్న పట్నం సునీతారెడ్డి ఇందుకు అవసరమైన జెడ్పీ నిధులను మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ చిన్నచిన్న పనులు మిగిలి ఉండడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. ఇదే భవనానికి అదనంగా మరో రూ.ఐదు లక్షలు జెడ్పీ నిధులను ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి ఆరేళ్ల కిందట మంజూరు చేశారు. అయినా, అసంపూర్తి పనులు మాత్రం నేటికి పూర్తి కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు.

ఆస్తి దక్కుతుందని హత్య

గడిసింగాపూర్‌లో వీడిన వృద్ధురాలి హత్య మిస్టరీ

పరిగి: ఆస్తికోసం వృద్ధురాలిని హత్య చేసిన ఘటన పరిగి మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్‌లు తెలిపిన వివరాల ప్రకారం .. గడిసింగాపూర్ గ్రామానికి చెందిన హరిజన నర్సమ్మ(70) ఈనెల 16న అనుమానాదస్పదస్థితిలో మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టారు. అనుమానితుడు గణేష్‌ను ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. మృతురాలకు సంతానం లేకపోవడంతో ఆమెపై వారసత్వంగా వచ్చిన భూమి 2.28 ఎకరాల పొలం ఉండటంతో ఆ భూమి నర్సమ్మ చెల్లెలు కొడుకుకు ఇస్తానని చెప్పింది. దీంతో వరసకు మనవడు అయ్యో గణేష్ తనకు ఆస్తి ఇవాలని నిత్యం అడుగుతుండగా సమాధానం సక్రమంగా రాకపోవడంతో ఈనెల 15న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న నర్సమ్మ ముఖంపై పిడిగుద్దులు గుద్ది, ముఖంపై దిండు పెట్టి ఊపిరి ఆడకుండా చేసి, చీర కొంగుతో గొంతుకు బిగించి హత్య చేశాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మల్లన్న జాతర



మల్లన్నస్వామి జాతరలో బోనాలతో మహిళలు

తాండూరు రూరల్: మల్లన్న సల్లాంగ చూడు స్వామి అని భక్తులు వేడుకున్నారు. మండలంలోని నారాయణపూర్‌లో ఆదివారం మల్లిఖార్జునస్వామి జాతర వైభవంగా జరిగింది. మహిళలు డప్పుల వాయిద్యాల మధ్య బోనాలతో తరలివచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండి గ్రామంలోని ప్రజలందరిని చల్లంగా చూడాలని మొక్కుకున్నారు. మల్లన్నస్వామి జాతరలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, నారాయణపూర్ గ్రామ శివారులోని రామస్వామి దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఏడుగురిపై కేసు నమోదు

తాండూరు టౌన్ : పేకాట స్థావరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. తాండూరు మండలం దస్తగిరి పేట్‌లో పలువురు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ.12,210 నగదు, ఏడు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ జిల్లా ఇన్‌చార్జి ప్రశాంత్‌వర్దన్ తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడంగల్ : మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చిట్లపల్లి గ్రామానికి చెందిన నర్సప్ప (60) ప్రమాదవశాత్తు టిప్పర్ వెనుక టైరు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన ఆంజనేయులుగా గుర్తించినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం మృతి



హన్మంత్‌రెడ్డి (ఫైల్)

ధారూరు: రిటైర్డ్ హెచ్ఎం, కాంగ్రెస్ నాయకులు హన్మంత్‌రెడ్డి ఆదివారం అకస్మతుగా మృతి చెందారు. మండల పరిధిలోని దోర్నాల్ గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యాడు. 5 సంవత్సరాల పాటు కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగారు. ఆయన మృతికి కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

ఎండలు బాబోయ్ ఎండలు



బోటింగ్ చేయడానికి వచ్చిన పర్యాటకులు

- బోటింగ్ చేశామా.. వెళ్లామా..
- ప్రాజెక్టు వద్ద ఆగని పర్యాటకులు

ధారూరు: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద మండుతున్న ఎండలకు పర్యాటకులు వచ్చామా, వెళ్లామా అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం ప్రాజెక్టు వచ్చిన పర్యాటకులు ఎక్కువ సమయం గడపకుండా బోటింగ్ చేయడం, ఆ వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవడం కన్పించింది. దీంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి తగ్గిందని, తమ వ్యాపారాలు కూడా అంతగా కొనసాగడం లేదని చిరు వ్యాపారులు వాపోయారు.

ఆటోను ఢీకొట్టిన స్కూలు బస్సు

నలుగురికి తీవ్ర గాయాలు

పహాడీషరీఫ్: స్కూలు బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ నుంచి మామిడిపల్లి మీదుగా ఓ ఆటోలో ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, శివకుమార్, పాండు మైలార్‌దేవ్‌పల్లికి వెళ్తున్నారు. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ సమీపంలో రోడ్డు నిర్మిస్తుండడంతో ఒకే మార్గంలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ సమయంలో ఎదురెదురుగా వస్తున్న ఆటో, ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జయి అందులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గురుస్వామికి ప్రముఖుల నివాళి



పాడె మోస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అందరినీ ఆధ్యాత్మిక మార్గంలో నడిపించిన గురుస్వామి సతీషన్‌నాయర్ అనారోగ్యంతో మృతి చెందడటంతో విశ్వాసులు కన్నీటి పర్యంతం అయ్యారు. కొంత కాలంగా అనారోగ్యం బారిన పడిన సతీషన్‌నాయర్ శనివారం తుది శ్వాస విడిచిన విషయం విదితమే. స్వగ్రామమైన పాల్మాకులలో ఆదివారం మధ్యాహ్నం ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ యాత్రలో సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్, శ్యాంసుందర్‌రెడ్డిలు అంతిమయాత్రలో పాడెను మోశారు.

‘మహతి మౌక్తికములు కావ్యావిష్కరణ’



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధారెడ్డి, నర్సింహారెడ్డి

ఆమనగల్లు: పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు, కవి దాస ఈశ్వరమ్మ రచించిన మహతి మౌక్తికములు కావ్యాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా.నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. నగరంలోని రవీంద్రభారతిలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవి సంగమం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం కింద కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ రచించిన కావ్యం మహతి మౌక్తికములను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డా.ఏనుగు నర్సింహారెడ్డితో కలిసి డా.నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహతి సాహితీ కవి సంగమం అధ్యక్షుడు డా.అడిగొప్పుల సదయ్య, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అడవి నరికివేత!



సంగయపల్లి అడవిలో చెట్లను నరికి మొదళ్లకు నిప్పపెట్టిన దృశ్యం



చెట్లను నరికి కలపగా మార్చిన అక్రమార్కులు

- రాస్నం సెక్షన్ అడవిలో ఇష్టారాజ్యం
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్ సంగయపల్లి బీట్‌లో అక్రమార్కులు అడవిని నరికివేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జేసీబీలను వినియోగించి చెట్లు, పొదలను తొలగిస్తూ అడవి భూమిని ఆక్రమించుకుంటున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు, రైతులు వాపోతున్నారు.సంగయపల్లి బీట్‌లో 4 ఎకరాల వరకు చెట్లను నరికి పొలం తయారు చేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. సంగయపల్లితండాకు చెందిన కొందరు సమీప అడవిలోని చెట్లను జేసీబీ సహాయంతో రాత్రి వేళల్లో చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. రాత్రిపూట అడవిలో నిఘా లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడవిలో అన్ని రకాల చెట్లను నరికివేయడం, అందులో విలువైన చెట్లను బాటరీ రంపంతో ముక్కలుగా చేసి బహిరంగ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం పోడు భూముల పేరిట పట్టాలివ్వడంతో భూములున్నా వారు కూడా అడవి ని నరికివేస్తున్నారు. ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌కు విషయం తెలిసినా పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడవిని నరికి మొదళ్ల ఆనవాళ్లు కనబడకుండా నిప్పుపెట్టి దగ్ధం చేస్తున్నా రు. అడవిని రక్షించే బాధ్యతను విస్మరించిన అధికారులపై, నరికిన ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.